క్లుప్తంగా

కార్గో సేవలు ప్రారంభం



శంకరపట్నం: కేశవపట్నం బస్టాండ్‌లో కార్గో సేవలను డీఎం రవీంద్రనాథ్ బుధవారం ప్రారంభించారు. ప్రజలు కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు అన్వేశ్, చంద్రమౌళి, మాజీ సర్పంచ్‌లు రాములు, శివారెడ్డి, సూపరింటెండెంట్ సారయ్య, సాగర్, పీహెచ్‌రావు, వెంకటస్వామి, మొగిళి, ప్రయాణికులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిజ్ఞ

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్) దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ అంజనేయరావు ఎన్‌ఎస్‌ఎస్ జెండా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎన్‌ఎస్‌ఎస్‌తో విద్యార్థుల్లో సేవా, అంకితభావం ఏర్పడుతుందని, సమాజాభివృద్ధిలో భాగస్వాములు అవుతారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో ఎన్‌ఎస్‌ఎస్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సుగుణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారు సాంఘిక సంక్షేమ సైనిక శిక్షణ విద్యాలయానికి చెందిన కెడెట్ అక్షయ్ ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జనగామ జిల్లా కేంద్రంలో ఈ నెల 25 నుంచి 27 వరకు జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి ఇంటర్ డిస్ట్రిక్ ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్– 2025 పోటీల్లో పాల్గొననున్నాడు. గురుకుల విద్యాలయం తరుపున రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన అక్షయ్‌ని ప్రిన్సిపాల్ కాళహస్తి, సుమన్, శ్రీనివాస్, ప్రమోద్ రాజు, తదితరులు అభినందించారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన



జమ్మికుంట: మహబూబ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌రెడ్డిపై మాజీ ప్రజాప్రతినిధి బూతులు తిడుతూ దాడి చేయడాన్ని నిరసిస్తూ బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట కమిషనర్ ఎండీ అయాజ్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. పట్టణ అభివృద్ధి కోసం పని చేస్తున్న అధికారులపై దాడులు చేయడం సరికాదని, దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో మేనేజర్ రాజిరెడ్డి, ఏఈ వికాస్, జేఏవో రాజశేఖర్‌రెడ్డి, టీపీబీవో దీపిక, సీనియర్ అసిస్టెంట్లు భాస్కర్, వాణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అవగాహన



రామడుగు: నానో యూరియాతో రైతులు మంచి ఫలితాలను పొందవచ్చని చొప్పదండి ఏడీఏ ప్రియదర్శిని అన్నారు. మండలంలోని చిప్పకుర్తి గ్రామంలో బుధవారం గోపాల్‌రావుపేట మన గ్రోమోర్ కేంద్రం ఆధ్వర్యంలో గడ్డల రవీందర్ వ్యవసాయ పొలంలో డ్రోన్‌తో నానో యూరియా పిచికారీ చేసే విధానంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు వరి పొలంలో ఎకరాకు 500 మిల్లీలీటర్ల నానో యూరియా రెండుసార్లు పిచికారీ చేస్తే మంచి దిగుబడి పొందవచ్చని, రైతులందరూ వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. కార్యక్రమంలో ఏవో త్రివేదిక, ఏఈవో అనంతరాజ్, మన గ్రోమోర్ మార్కెటింగ్ ఏరియా మేనేజర్ ఎ. అఖిల, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

మరుగునపడిన రాజీవ్ యువవికాసం



మాట్లాడుతున్న తిరుపతి

చిగురుమామిడి: రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాస పథకాన్ని మరుగున పెట్టిందని, నిరుద్యోగ భృతి ఊసే ఎత్తడంలేదని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధానకార్యదర్శి జి. తిరుపతి ఆరోపించారు. బుధవారం చిగురుమామిడిలో డీవైఎఫ్ఐ మండల కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఏటా ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఎన్నికల సమయంలో చెప్పి మాటమార్చారని విమర్శించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎ. భాస్కర్, డివైఎఫ్ఐ మండల నాయకులు శివచరణ్, మనిచరణ్, రామ్‌చరణ్, మోక్షిత్, అభిలాష్, రాహుల్, శశిరెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.



ఏడాదిలో పెద్ద పండుగ



హిందూ సాంప్రదాయంలో ఏడాది పొడవునా పండుగలు వస్తుంటాయి. కానీ సద్దుల బతుకమ్మ, దసరా పండుగలు సమీపించే సమయంలో ముందు నుంచే సందడి ఉంటుంది. సద్దుల బతుకమ్మ పండుగ వచ్చిందంటే కొత్త బట్టల కొనుగోలు, బతుకమ్మలు పేర్చడానికి పూల సేకరణ ఎప్పుడు కొత్తగానే ఉంటుంది.

– మెరుగు రేఖ, చొప్పదండి

సామూహిక వేడుక



ఇతర పండుగలకు భిన్నంగా బతుకమ్మ సందడి ఉంటుంది. బొడ్డెమ్మ వేసినప్పటి నుంచి సద్దుల బతుకమ్మను సాగనంపే వరకు ఈ పండుగ సామూహికంగా కొనసాగుతోంది. గ్రామ, పట్టణ ప్రాంతాల్లో ఇంటిల్లిపాది ఒకే చోట చేరి వేడుకలను నిర్వహించుకోవడం జరుగుతుంది. ఏటా పండుగా కొత్త ఆనందాలను నింపుతోంది.

– బొడిగె పద్మ, చొప్పదండి

ఆడబిడ్డల పండుగ



బతుకమ్మ పండుగ అంటేనే ఆడబిడ్డల పండుగ. పెళ్లైన ప్రతీ మహిళా మెట్టినింటి నుంచి పుట్టిన ఇంటికి వెళ్లి బతుకమ్మ ఆడుతుంది. సద్దుల బతుకమ్మ రోజున పుట్టింట్లో గౌరమ్మను కొలిచి చివరి రోజున గౌరమ్మను సాగనంపుతుంది. పుట్టింటి, మెట్టినింటి మధ్య బలమైన బంధాలకు బతుకమ్మ పండుగ వారధిగా నిలుస్తోంది.

– మొల్యాల ప్రమీల, చొప్పదండి

రైతన్న జాగ్రత్త

పురుగుమందు పిచికారీతో కంటి సమస్యలు

జమ్మికుంట: సర్వేంద్రియానం నయనం ప్రధానం. అన్నదాతలు పత్తి, వరి, మొక్కజొన్న తదితర పంటలకు మందులు పిచికారీ చేసే సమయంలో జాగ్రత్తలు పాటిస్తే కంటి సమస్యలు దూరమవుతాయని జమ్మికుంటకు చెందిన ప్రముఖ కంటి వైద్యనిపుణుడు చిట్టిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మందుల పిచికారీతో రైతులు అనేక కంటి సమస్యలతో బాధపడుతున్నారని, పిచికారీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు తెలియజేశారు. గరగర, నీరు కారడం, వెలుతురు చూడ లేకపోవడం, కంటి రెప్పల వాపు, మసకబారడం, నొప్పి వంటి లక్షణాలు ఏర్పడితే వెంటనే డాక్టర్‌ను సంప్రదించి చికిత్స తీసుకుంటే కార్నియల్(కంటి నల్లపాప) దెబ్బతినకుండా ఉంటుందన్నారు. మందులు చల్లేటప్పుడు తలకు హెల్మెట్, కళ్లద్దాలు, మాస్క్ ధరించాలని, మందు డబ్బా మూతలు తీసేటప్పుడు దూరంగా ఉండాలన్నారు. కంటిలో మందుపడితే నలపకుండా శుభ్రమైన నీటితో కడగాలన్నారు. జిల్లేడు చెట్లు తొలగించేటప్పుడు చెట్టు నుంచి వచ్చే పాలు కంటిలో పడితే చాలా ప్రమాదకరం. కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. జాగ్రత్తలు పాటించకపోవడం వల్లే కంటి, నోటి, శ్వాస సంబంధ వ్యాధుల బారినపడుతున్నారు. జమ్మికుంట ప్రాంతంలోని రైతులు రోగాల బారిన పడుతున్నారని వివరించారు.



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



రామడుగు: కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారి వెలిచాల క్రాసింగ్ వద్ద భారీ గుంతలతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. పలుమార్లు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు దారిపై వెళ్తుంటాయి. గుంతల వల్ల నిత్యం ఇబ్బందికరంగా ప్రయాణం చేయాల్సి వస్తుందని డ్రైవర్లు, ప్రయాణికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు గుంతలను పూడ్చివేయించాలని ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సాయికృష్ణ, ఆర్అండ్‌బీ ఏఈ సెల్: 9008479686

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227



చిగురుమామిడిలో బతుకమ్మ వేడుకలు



హుజూరాబాద్‌రూరల్: పెద్ద పాపయ్యపల్లిలో...

బతుకమ్మ సంబురాలు

చిగురుమామిడి: మండల పరిషత్ కార్యాలయం ఎదుట మహిళా ఉద్యోగులు తీరొక్క పూలతో బతుకమ్మ పేర్చి ఆడిపాడారు. బుధవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు సంబరాల్లో పాల్గొన్నారు. అందంగా పేర్చిన బతుకమ్మలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రకటించారు. మొదటి బహుమతి మండల పరిషత్, ద్వితీయ బహుమతి ఐసీడీఎస్, తృతీయ బహుమతి ఐకేపీ సెర్ఫ్ ఉద్యోగులు దక్కించుకున్నారు. అలాగే కన్సోలేషన్ బహుమతిని తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగినులకు అందించారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పెద్ద పాపయ్యపల్లి గ్రామంలోని నాగార్జున డెయిరీ ఆవరణలో బతుకమ్మ సంబరాలు కన్నుల పండుగ నిర్వహించారు. నిత్యం విధుల్లో నిమగ్నమయినా సిబ్బంది ఆనందంగా ఆడిపాడారు. తీరొక్క పువ్వులతో అందంగా పేర్చిన బతుకమ్మలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డైరెక్టర్ గణేశ్‌రావు, సీఈవో కృష్ణ ప్రసాద్, మేనేజర్లు సుధాకర్, రజనీకాంత్ రెడ్డి, సంతోష్, శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గం



చిగురుమామిడి: మండలంలోని చిన్నములకనూర్ బీసీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్షుడిగా బరిగెల సదానందం, ప్రధానకార్యదర్శిగా మర్రి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా రంగు శ్రీధర్, కయ్యం శ్రీనివాస్, బూల ఐలయ్య, సహాయ కార్యదర్శిగా గుండ సాయిచందు, పెసరి హరీశ్, కోశాధికారిగా చిలివేరు వెంకటేశ్, ప్రచార కార్యదర్శిగా నారాయణపురం వెంకన్నతో పాటు మరో ఐదుగురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారని మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్ తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి విష్ణుమాచారి, నాయకులు పెసరి రాజేశం, పలువురు పాల్గొన్నారు. కాగా తాళ్లపల్లి తిరుపతిని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య బుధవారం ప్రకటనలో తెలిపారు.

అర్ధవార్షిక మహాసభ

సైదాపూర్: సహకార సంఘాలతోనే రైతుల సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, అలాగే రైతుల సహకారంతోనే సహకార సంఘాలు బలోపేతమవుతున్నాయని వెన్నంపల్లి సింగిల్ విండో చైర్మన్ బిల్లా వెంకటరెడ్డి అన్నారు. బుధవారం వెన్నంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అర్ధవార్షిక మహాసభ సంఘం కార్యాలయంలో చైర్మన్ వెంకటరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. రైతుల సహకారంతో సంఘం జిల్లాలో ఏటా ప్రథమ స్థానంలో ఉంటూ జిల్లా కేంద్ర బ్యాంకు నుంచి పారితోషికం పొందుతుందని, సంఘం రైతుల శ్రేయస్సు కోసం కృషి చేస్తోందన్నారు. రైతుల సౌకర్యంకోసం పెట్రోల్ బంకు, గోదాంల నిర్మాణం, సంఘం కార్యాలయ నూతన భవన నిర్మాణం ప్రభుత్వ సహాయంతో చేపట్టామన్నారు. యూరియా కొరత త్వరలోనే తీరనుందని, రైతులు వచ్చిన యూరియాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ అనుబంధ ఇతర రంగాల్లో వ్యాపారం చేస్తూ సహకార సంఘాలు ఆర్థికంగా ఎదిగాయన్నారు. మహాసభలో డైరెక్టర్లు, సీఈవో మల్లారెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వార్షిక మహాసభ

హుజూరాబాద్: పట్టణంలోని చేనేత పారిశ్రామిక సహకర ఉత్పత్తి అండ్ విక్రయ సంఘం వార్షిక మహాసభ బుధవారం సంఘం ఇంచార్జి ఎలిగేటి ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించారు. సభకు చేనేత జౌళిశాఖ డీవో ఎంఏ హజార్ వహాబ్ హాజరై మాట్లాడారు. సంఘం సభ్యులకు హెల్త్‌కార్డ్స్, అంత్యోదయ కార్డ్స్, నేతన్న భరోసా పథకం తదితర విషయాలు అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. సభ్యుల ఆరోగ్యం కోసం హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఎలిగేటి ఉపేందర్ మాట్లాడుతూ... సభ్యులు, సిబ్బంది సహకారంతో సంఘం లాభాల బాటలో నడుస్తుందన్నారు. ఈ సంవత్సరం 42 శాతం బోనస్, ప్రోత్సాహక నిధులతో జిల్లాలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. అనంతరం వార్షిక మహాసభ నివేదిక, తీర్మానాలను చదివి వినిపించారు. సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ కోటిలింగం, సభ్యులు యాదగిరి, మహాదేవ్, మంచికట్ల వెంకటయ్య, సత్యానరాయణ, వాణి, సుమలత పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

విగ్రహ పునఃప్రతిష్ఠాపన



చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో పోచమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, బైండ్ల కళాకారుల ఆటపాటల మధ్య అమ్మవారి ఆలయంలో విగ్రహం ప్రతిష్ఠించారు. అమ్మవారి చరిత్రను కళాకారులు కథా రూపంలో ఆలపించారు. కార్యక్రమం మాజీ ఎంపీటీసీలు కత్తుల రమేశ్, మిట్టపెల్లి మల్లేశ్, మాజీ ఉపసర్పంచ్ పెండ్యాల సదానందంల, మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు తోట శ్రీనివాస్, శాలివాహన సంఘం నాయకులు దరిపెల్లి సంపత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ సర్పంచ్‌లు కానుగంటి భూంరెడ్డి, కొంకట రవి, గ్రామ ప్రముఖులు కంది శంకర్, వీరగోని విజ్జగిరి, కత్తుల ప్రశాంత్, చట్ల మొగిలి, సొల్లు శ్రీను, మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ యాసిన్, మామిడి వెంకటయ్య, బండి శేరాలు, వేమసాని వేణు, సతీష్ పాల్గొన్నారు.

కుంకుమపూజ

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేటలో మాజీ ఎంపీటీసీ ఎడవెల్లి నరేందర్‌రెడ్డి ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో బుధవారం వేదపండితుల ఆధ్వర్యంలో కుంకుమ పూజ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గామాతకు ప్రత్యేక పూజలు, హోమం చేశారు. అలాగే వెలిచాల గ్రామంలోని దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నక్షత్ర హారతి బహూకరణ



గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట శ్రీమానసాదేవి ఆలయానికి అదే గ్రామానికి చెందిన బద్దం మహిపాల్‌రెడ్డి బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి 108 దీపాలతో కూడిన నక్షత్ర హారతిని బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి ఆధ్వర్యంలో దాతలను సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బద్దం లచ్చవ్వ, మమత, వెంకట్‌రెడ్డి, శివకిరణ్ రెడ్డి, మహైకా శ్రీ పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం



ప్రణవ్‌ను సత్కరిస్తున్న ఆలయ పూజారులు, ఈవో, తదితరులు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి శ్రీదుబ్బమల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా ప్రహరీ నిర్మాణానికి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ పథకం ద్వారా రూ.9.70లక్షలు మంజూరు చేయించి కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్‌ను ఆలయ పూజారి మేడిపల్లి వెంకన్న, ఆలయ ఈవో సుభద్ర శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇల్లందకుంట దేవాస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి, మేడిపల్లి ఓదెలు, మేడిపల్లి శ్రీనివాస్, ఒగ్గు పూజారులు రాజకొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని జూపాక గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కమిటీ అధ్యక్షుడు గిన్నారపు మహేందర్ అధ్యక్షతన అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎం పీటీసీ కేతిరి రాజిరెడ్డి, మాజీ సర్పంచులు చేపూరి ప్రభాకర్, ఇల్లందుల స్వరూప శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ తాళ్లపల్లి రాజేందర్, పంజాల రాజయ్య, మాజీ వార్డు సభ్యులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామంలో చందుపట్ల వెంకటేశ్ స్మారకార్థం బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా టౌన్ సీఐ కరుణాకర్ ప్రారంభించారు. రక్తదానంతో ఆపదలో ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ సీటిజన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి దేవునూరి కిరణ్, కంకణాల పర్శరాములు, మాజీ సర్పంచ్ చందుపట్ల పరందాములు తదితరులు ఉన్నారు.

ఏళ్లనాటి కల తీరనుంది

గన్నేరువరం: గన్నేరువరం మండలంలోని చొక్కారావుపల్లె–ఖాజీపూర్ మధ్య మానేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి కేంద్రం నుంచి నిధుల మంజూరు చేయించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం సన్మానించారు. పార్టీ శ్రేణులతో కలిసి కరీంనగర్‌లోని కేంద్ర మంత్రి నివాసానికి వెళ్లి శాలువాలతో సన్మానించారు. బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఏళ్లనాటి ప్రజల కల సాకారం కానుందన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని శ్రీమహాశక్తి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అభివృద్ధి సంస్థ చైర్ పర్సన్ బండ్రు శోభారాణి, కాంగ్రెస్ పార్టీ గన్నేరువరం అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, నాయకులు బండారి రమేష్, మోరపల్లి రమణారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాస్‌రావు, కుంట రాజేందర్‌రెడ్డి, శ్రీగిరి రంగారావు, మామిడి అనిల్‌కుమార్, చింతల లక్ష్మారెడ్డి, కొమ్మెర రవీందర్‌రెడ్డి, చిట్కూరి అనంతరెడ్డి, కొత్త తిరుపతిరెడ్డి, అకుల వెంకన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన బీజేపీ నాయకులు

మండల ప్రజల రవాణా కష్టాలు తీర్చడం కోసం వంతెన కోసం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అవసరమైన సహాయ సహకారాలకు కృషిచేసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను మహాశక్తి దేవాలయం వద్ద బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పుల్లెల పవన్ కుమార్, సొల్లు అజయ్‌వర్మలు సన్మానించారు. కార్యక్రమంలో పుల్లెల రాము తాళ్లపల్లి పరశురాం గుడెల్లి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

క్షీరాభిషేకం

తిమ్మాపూర్: బ్రిడ్జి నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఎల్ఎండీలోని ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నాయకులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. మండల ప్రజల కోరిక ఎట్టకేలకు తీరనుందని, కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. బండి సంజయ్‌కుమార్, రేవంత్‌రెడ్డి కృషి వల్లనే బ్రిడ్జి నిర్మాణానికి కేంద్రం రూ.77 కోట్ల నిధులు మంజూరు చేసిందని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, కొమ్మెర రవీందర్‌రెడ్డితో పాటు చొక్కారావుపల్లె గ్రామస్తులు పాల్గొన్నారు.

బయటకెళ్లాలంటే భయం



చొప్పదండి: పండుగల పూట పట్టణ ప్రజలకు కుక్కల బెడద పట్టుకుంది. స్కూల్, కాలేజీలకు సెలవులు రావడంతో విద్యార్థులు ఇళ్లకే పరిమితమవుతున్నారు. కుక్కలు ఎక్కడ దాడి చేస్తాయోనని రోడ్డుపైకి రావాలంటేనే భయంగా ఉందని వాపోతున్నారు. పట్టణంలోని అన్ని వీధుల్లో కుక్కల సంఖ్య పెరిగిపోయిందని అంటున్నారు. ఎక్కడ చూసినా గుంపుగా ఉంటున్నాయని, ఇప్పటికే పలు కుక్కలు చర్మ వ్యాధులకు గురై భయానకంగా సంచరిస్తున్నాయని, మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

శేఖర్ మృతి తీరని లోటు

రామడుగు: డ్యాన్స్ మాస్టర్ దాసరి శేఖర్ మృతి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో బుధవారం శేఖర్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

రసమయి మాటలు అర్థరహితం

తిమ్మాపూర్: ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, రాంలీలా కమిటీపై మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాటలు అర్థరహితమని, పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని రాంలీలా కమిటీ చైర్మన్ కుంట రాజేందర్‌రెడ్డి అన్నారు. మండలంలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధి, రాంలీలా ఘనంగా నిర్వహించేందుకు జరుగుతున్న ఏర్పాట్లను చూసి రసమయికి దిక్కుతోచడం లేదని, రాంలీలా కోసం డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు చేస్తున్నారని, ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. రాంలీలాకు కాంగ్రెస్ పార్టీ, ఎమ్మెల్యేతో ఎలాంటి సంబంధం లేదని, వేడుకలను రాజకీయ కోణంలో చూడొద్దని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బండారి రమేశ్, నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, మోరపల్లి రమణారెడ్డి, మామిడి అనిల్ కుమార్, దావు సంపత్‌రెడ్డి, పోలు రమేశ్, మాచర్ల అంజయ్య, గంకిడి లక్ష్మారెడ్డి, అన్నాడి రఘు, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

హుజూరాబాద్: పట్టణంలోని విద్యానగర్‌లో బుధవారం షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధమైంది. కొమురవెల్లి సంతోష్ బుధవారం బయటికు వెళ్లేందుకు కారు స్టార్ట్ చేయగా ఒక్కసారిగా ఇంజిన్ నుంచి పొగలు వచ్చి మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పేశారు. ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ గ్రామంలో బుధవారం బైక్ అదుపుతప్పి కిందపడటంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. మక్త గ్రామానికి చెందిన దొంతుల శ్రీనివాస్ కన్నాపూర్‌కు చెందిన స్నేహితుని పుట్టిన రోజు వేడుకలకు హాజరై తిరిగి వస్తుండగా బైక్ పైనుంచి కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108లో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

సంక్షిప్త వార్తలు

మైనర్లు వాహనాలు నడపొద్దు

శంకరపట్నం: మైనర్ బాలురు బైక్‌లు నడుపుతుండగా కేశవపట్నం పోలీసులు పట్టుకున్నారు. వివిధ గ్రామాల్లో నాలుగు ద్విచక్రవాహనాలను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని ఎస్సై శేఖర్‌రెడ్డి సూచించారు. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గన్నేరువరం: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం తోటపల్లి గ్రామంలోని మోయతుమ్మెద వాగు నుంచి అక్రమంగా ఇసుకను గన్నేరువరం మండలంలోని గ్రామాలకు తరలిస్తుండగా బుధవారం గుండ్లపల్లి ఎక్స్‌రోడ్ వద్ద పట్టుకున్నామని, వాహనాలను పోలీస్ స్టేషన్ తరలించి డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేశామన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

జమ్మికుంట: హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో సూపర్‌వైజర్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డుతో పాటు ఇతర పనుల నిర్వహణ బాధ్యత తీసుకున్న కాంట్రాక్టర్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు బుధవారం డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులు అవకతవకలకు పాల్పడ్డారని కలెక్టర్ విచారణ జరిపి ఇరవై మందిని తొలగించి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. కాంట్రాక్టర్ నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేని వ్యక్తుల నుంచి డబ్బు తీసుకొని ఉద్యోగం కల్పించారని, దీంతో విధుల్లో నిర్లక్ష్యం, తప్పులు జరుగుతున్నాయని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.